


భూములు కోల్పోయాం.. న్యాయం చేయండి

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌కు గిరిజనుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం

భూములు కోల్పోయిన తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ అల్లూరి సీతారామరాజుజిల్లా పెదబయలు, డుంబ్రిగుడ మండలాలకు చెందిన గిరిజనులు ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు కు వినతిపత్రం అందజేశారు. విజయనగరంలోని కమిషన్ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో గురువారం డాక్టర్ డివిజి శంకరరావు ను కలిసి తమ సమస్యను తెలిపారు. పెదబయలు, డుంబ్రిగుడలో ఏకలవ్య మోడల్ స్కూల్స్ నిర్మాణంలో తాము భూములు కోల్పోయామని తెలిపారు. అయితే తమకు నష్టపరిహారం, ఉపాధి కల్పించడం విషయంలో అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. అనేక సార్లు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకు వెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు.

విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఏకైక సంకిలి ఇఐడి ప్యారీ సుగర్స్ కర్మాగారం లాకౌట్ దిశగా పయనిస్తోంది. ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఎగ్జిక్యూటివ్ సిబ్బంది తొలగింపు చర్యలు ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. ఇక కార్మికుల వంతే ఉందంటూ వాటిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇదే జరిగితే రెండు జిల్లాలకు చెందిన 6, 516 మంది చెరకు రైతుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుంది.



ఆ ఒక్కటీ మూతే!

- లాకౌట్ దిశగా సంకిలి ప్యారీ సుగర్స్
- 35 మంది ఎగ్జిక్యూటివ్ సిబ్బంది, 85 మంది అవుట్ సోర్సింగ్ కార్మికుల తొలగింపు
- అగమ్య గోచరంలో చెరకు రైతులు
- 2026 చెరకు క్రషింగ్ లక్ష్యం తెలియదంటున్న సిబ్బంది

ప్రజాశక్తి-రేగిడి

రేగిడి మండలం సంకిలిలోని ఇఐడి ప్యారీ సుగర్స్ కర్మాగారం పరిధిలో ప్రస్తుతం 6,516 మంది రైతులు చెరకు సాగు చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీని 20 సంవత్సరాలుగా జిఎంఆర్ సంస్థ నడిపేది. కొన్ని కారణాలవల్ల చెన్నైకు చెందిన మురగప్ప సంస్థకు ఈ కర్మాగారాన్ని ఏడేళ్ల క్రితం విక్రయించారు. కర్మాగారంలో 173మంది పర్మినెంట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు, 60మంది వరకు ఎగ్జిక్యూటివ్‌లు పనిచేస్తున్నారు. వీరంతా 27 నుంచి 25 సంవత్సరాల అనుభవం ఉన్నవారు. ఐతే చెన్నై మురుగప్ప సంస్థ యాజమాన్యం సంకిలి సుగర్ ఫ్యాక్టరీకి వచ్చి ఎగ్జిక్యూటివ్ సిబ్బంది 45మందిని, అవుట్ సోర్సింగ్ కార్మికులు 80మందిని తొలగించింది. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమను ముందుగా నోటీసులు ఇవ్వకుండా తొలగించడం అన్యాయమని ఆవేదన చెందుతున్నారు. ఈ చర్యతో కార్మికులు కూడా తమను కూడా యాజమాన్యం తొలగిస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

2026 నాటికి లాకౌట్ దిశగా సుగర్ ఫ్యాక్టరీ పయనిస్తోందని కార్మికులు అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం, సుగర్స్ యాజమాన్యం మధ్య ఉన్న పంచదార అగ్రిమెంటు 2026 నాటికి పూర్తవ్వని వెంటనే ఫ్యాక్టరీ లాకౌట్ గాని, కార్మిక, ఉద్యోగులకు సెటిల్ మెంట్ చేసే పరిస్థితి గాని ఉంటుందని చర్చ జరుగుతోంది. ఇప్పటికే కొందరు పర్మినెంట్ కార్మికులను సుగర్ ఫ్యాక్టరీ నుంచి ఇథనాల్ కర్మాగారానికి బదిలీ చేసి, అక్కడ అవుట్ సోర్సింగ్‌లో పనిచేసే కార్మికులను తొలగించారు.

ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ శ్రీకాకుళం జిల్లాలో ముడిఎళ్ల క్రితం 12వేల మంది రైతులతో ఆరు లక్షల మెట్రిక్ టన్నులు చెరకు గానుగ ఆడేది. దీనికి తోడు విజయనగరం జిల్లా లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ నుంచి అగ్రిమెంట లేని చెరకు కొనుగోలు చేసి ఆడించేవారు. రైతులకు ఎన్నో రాయితీలు అందించేవారు. అప్పుడు రోజుకు 4,500 టన్నుల కెపాసిటీతో చెరకు క్రషింగ్ చేసేవారు. ప్రస్తుతం రెండేళ్ల నుంచి మురుగప్ప సంస్థ సంకిలి షుగర్ ఫ్యాక్టరీని పట్టించుకోకపోవడంతో చెరకు ఉత్పత్తి, రైతులకు రాయితీలు వంటివి గాలికి వదిలేసాయని రైతులు చెబుతున్నారు. దీంతో రైతులు అగమ్యగోచరంలో పడిచెరకు పంటను తగ్గించుకుంటూ మొక్కజొన్న పంటవైపు మొగ్గు చూపుతున్నారు. వచ్చే ఏడాది క్రషింగ్ కు ప్రస్తుతం 2.10 మెట్రిక్ టన్నులు చెరకు ఉందని యాజమాన్యం చెబుతోంది. వచ్చే ఏడాది క్రషింగ్ విషయమై ప్రజాశక్తి యాజమాన్యాన్ని వివరణ కోరేందుకు వెళ్లగా తమకేమీ తెలియదని సిబ్బంది సమాధానమిచ్చారు.

రికార్డుల ట్యాంపరింగ్‌పై కలెక్టర్ ఆగ్రహం

పిజిఆర్‌ఎస్ వినతులపై సమీక్ష ● తూడెంలో భూ వివాదంపై గ్రామస్తులతో చర్చ

ప్రజాశక్తి-భోగాపురం

రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్‌పై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భోగాపురం మండలంలో కలెక్టర్ అంబేద్కర్ గురువారం పర్యటించారు. కలెక్టర్ ముందుగా తూడెం గ్రామంలో పర్యటించారు. గ్రామంలో నెలకొన్న భూ వివాదం పై గ్రామస్తులను ఆరా తీశారు. భూములను పరిశీలించారు. గ్రామానికి సంబంధించిన వివాదం కావడంతో, ముందుగా గ్రామ పెద్దలు, గ్రామస్తులంతా కలిసి చర్చించుకోవాలని సూచించారు. అప్పటికి పరిష్కారం కాకపోతే గ్రామాన్ని మరోసారి రీ ర్వ్య చేసి, ఎవరి భూముల వారికి అప్పగించేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.



తూడెంలో భూములను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

ముఖ్యమంత్రి కార్యాలయానికి, రాష్ట్ర మంత్రి లోకేష్ కు, జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన గ్రీవెన్స్ వినతులపై భోగాపురం తాహశీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ సమీక్షించారు. ఒక్కో వినతిని పరిశీలించి, సంబంధిత అర్జీదారులతో ఫోన్లో, మరికొందరితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వాటిని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ అధికారులకు ఆదేశాలను జారీ చేశారు. భూముల రికార్డులను పరిశీలిస్తుండగా ఎఫ్‌సిఐ రికార్డుల్లో కవులవాడ గ్రామానికి సంబంధించి సర్వే నెంబర్ 128 కి చెందిన వివరాలతో కూడిన రెండు పేజీలు ట్యాంపరింగ్ జరిగినట్లు కలెక్టర్ గుర్తించారు. రెండు అసలు పేజీలను తొలగించి, వాటి స్థానంలో కొత్తగా రెండు పేజీలను అతికించి రికార్డుల్లోని వివరాలను మార్పు చేసి, డి పట్టాలను జారీ చేసినట్లు గుర్తించారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సత్వర న్యాయం అందించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపిస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించి, వాటి పరిష్కారాన్ని కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ డి.కీర్తి, తాహశీల్దార్ సురేష్, ఇతర రెవెన్యూ, సర్వే సిబ్బంది స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస పోలీసు స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన హత్య కేసులో నిందితుడు కొత్తవలస మండలం అప్పన్నదొర పాలెం పంచాయతీ జోడుమెరక గ్రామానికి చెందిన జోడి నాగరాజు (32)కు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ గురువారం జిల్లా జడ్జి బి.కల్యాణ చక్రవర్తి తీర్పు చెప్పారు. జోడిమెరక గ్రామానికి చెందిన జోడీ నాగరాజు తన భార్య లక్ష్మీ కనిపించడం లేదని 2022లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తవలస పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణలో ఫిర్యాది జోడు నాగరాజు తన భార్య అయిన జోడు లక్ష్మీని హత్య చేసి, పెట్రోల్ పోసి కాల్చివేసి, తిరిగి తన భార్య అదృశ్యం అయినట్లు ఫిర్యాదు చేసినట్లుగా నిర్ధారణ అయ్యిందన్నారు. నిందితుడిని, అతడికి సహకరించిన మౌనిక ను అప్పటి కొత్తవలస సిఐ బాలసూర్యారావు అరెస్టు చేసి రిమాండుకు తరలించి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు.

అంగన్వాడీలపై యాప్‌ల ఒత్తిడి

ప్రజాశక్తి- రాజాం

గుండెపోటుకు గురైన కార్యకర్త

అంగన్‌వాడీలపై ప్రభుత్వ యాప్‌ల ఒత్తిడి కారణంగా కార్యకర్తలు ఇబ్బందులకు గురవుతున్నారు. రేగిడి మండలం బూడితపేట అంగన్‌వాడీ కార్యకర్త కె.గౌరీశ్వరి రాజాం ఐసిడిఎస్ ఆఫీస్ వద్ద గుండె నొప్పితో గురువారం కుప్పకూలిపోయింది. తోటి కార్యకర్తలు వెంటనే స్పందించి ఆమెను 108 కేర్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా యాప్‌ల భారం అంగన్‌వాడీలపై తగ్గించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు రూపావతి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం, అధికారుల ఒత్తిళ్ళతో అంగన్వాడీ వర్కర్ల అనారోగ్యంపాలై తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి బాల సంజీవని కొత్త వర్షన్ 2.0 అమలు చేయాలని అంగన్వాడి వర్కర్లపై అధికారుల ఒత్తిళ్ళను తగ్గించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యాప్‌ల భారం తగ్గించాలని 42 రోజులు సమ్మె చేస్తే దాన్ని పక్కనపెట్టి కొత్తగా అంగన్వాడి కేంద్రాలకు సంబంధించి కొత్త వెర్షన్ బాల సంజీవని 2.0 తెచ్చి ప్రతిరోజు ఉదయం వర్కర్లు, హెల్పర్లు ఫోటోతో పాటు, ప్రీ స్కూల్ చిన్నారుల ఫోటోతో పాటు 15 మాడ్యూల్స్‌లో పనిచేసే విధానాన్ని తెచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ యాప్ ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లలో పనిచేయడం సాధ్యం కాదని, అధికారులు యాప్‌లను సవరించే పనిలో భాగంగా ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని రద్దు చేయాలని కోరారు. అంగన్వాడీ వర్కర్లపై పనిభారం తగ్గించి, వారి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.



గుండెపోటుకు గురైన అంగన్వాడీ కార్యకర్త గౌరీశ్వరిని 108 వాహనంలో తరలిస్తున్న తోటి కార్యకర్తలు

మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

డిఐజి గోపినాథ్ జెట్టి

ప్రజాశక్తి-రామభద్రపురం

మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజ్ డిఐజి గోపినాథ్ జెట్టి.. పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రామభద్రపురం పోలీసుస్టేషన్‌ను గురువారం సందర్శించారు. ఎస్‌పి వకుల్ జిందాల్, ఇతర పోలీసు అధికారులు డిఐజికి పోలీసు వందనంతో స్వాగతం పలికారు. అనంతరం స్టేషను పరిసరాలు పరిశీలించి, నూతనంగా అభివృద్ధి చేసిన వాహనాల షెడ్‌ను ఆయన ప్రారంభించారు. పోలీసుస్టేషన్‌లోని రిసెప్షన్, గదులను పరిశీలించి, పలు రికార్డులు, సిడి ఫైళ్లు తనిఖీ చేశారు. మహిళా సంరక్షణ పోలీసులతో మమేకమై శక్తి యాప్ గురించి క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం డిఐజి మాట్లాడుతూ గంజాయి నియంత్రణకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను విస్తృతంగా చేపట్టాలన్నారు. 280 డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి డేగకళ్లతో నిత్యం పర్యవేక్షణ చేసేలా బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గత 9 నెలల కాలంలో సుమారు 30 టన్నుల గంజాయి సీజ్ చేసి, 1600 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. గంజాయి కేసుల్లో దొరికిన ప్రధాన ముద్దాయిల నుంచి సుమారు రూ.5 కోట్ల ప్రాపర్టీ సీజ్ చేశామన్నారు. ఇక గంజాయి రవాణా చేసేందుకు వీలులేకుండా రోడ్డు, రైలు మార్గాల్లో కూడా విస్తృతంగా తనిఖీలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గంజాయి నివారణ కోసం సాగు చేసే అవకాశాలు లేకుండా చేస్తున్నామని వెల్లడించారు. దీనిలో భాగంగా 1200 ఎకరాల్లో గంజాయి సాగు చేయకుండా అడ్డుకొని, ప్రత్యామ్నాయ పంటల వైపు ఆకర్షితులను చేశామని వివరించారు. మసీదులు, చర్చిలు, దేవాలయాలు, ప్రముఖుల విగ్రహాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని ఆదేశించారు. వాటి పరిరక్షణకు స్థానికులతో రక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నక్సలైట్ల ప్రభావం తగ్గిందని, ప్రస్తుతం డొంకరాయి, మోతుగూడెం, మారేడుమిల్లి వంటి అటవీ ప్రాంతాల్లో సంచారం ఉన్నట్టు తెలుస్తోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి డిఎస్‌పి జి.భవ్యరెడ్డి, బొబ్బిలి రూరల్ సిఐ కె.నారాయణరావు, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, ఎస్‌ఐ వి.ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురంలో వాహనాల షెడ్‌ను ప్రారంభిస్తున్న డిఐజి గోపినాథ్ జెట్టి

పిటిసిలో మౌలిక వసతుల కల్పన

విజయనగరంకోట, డెంకాడ: సారిపల్లి వద్దగల పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి తెలిపారు. గురువారం శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి, ఇంకనూ అవసరమైన మౌళిక వసతుల కల్పన గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీసు శిక్షణ కేంద్రాల్లో గల తరగతి గదులను, ఆఫీసు కార్యాలయం, వంట గది, డైనింగు హాలు, పరేడ్ గ్రౌండు, లైబ్రరీ, ఫైరింగు రేంజ్‌లను పరిశీలించారు. శిక్షణ కేంద్రంలో సుమారు 200మంది పోలీసు కానిస్టేబుళ్ళు శిక్షణ పొందేందుకు అవసరమైన నిర్మాణాలను గతంలోనే చేపట్టినట్లుగా అధికారులు డిఐజికి వివరించారు. ప్రస్తుతం శిక్షణ కేంద్రంలోగల టీచింగు, నాన్ టీచింగు సిబ్బందిగా ఎంతమంది పని చేస్తున్నదన్న విషయాలను ఎస్‌పి వివరించారు. అనంతరం చింతవలస 5వ బెటాలియన్‌ను డిఐజి సందర్శించారు. కమాండెంట్ మల్లికా గార్గ్ ఆధ్వర్యంలో మౌలిక వసతులను పరిశీలించారు. బెటాలియన్ పోలీసు శిక్షణ కేంద్రంలో పోలీసులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తామన్నారు. ఆయన వెంట ఎస్‌పి వకుల్ జిందల్, అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిటిసి డిఎస్‌పి ఎం.వీరకుమార్, ఎస్‌బి సిఐ ఎ.వి.లీలారావు, భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ, డిటిసి సిఐ బి.లలిత, ఆర్‌ఐ ఎన్.గోపాల నాయుడు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న సిఐటియు నాయకులు

కార్మికులకు అండగా నిలవాలి

ప్రజాప్రతినిధులను కోరిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - చీపురుపల్లి

మండలంలోని కర్లాం, అలజంగి గ్రామాల సమీపంలో ఉన్న వెంకటరామా పౌల్ట్రీలో పని చేస్తున్న కార్మికులకు అండగా నిలవాలని సిఐటియు నాయకులు ప్రజాప్రతినిదులను కోరారు. ఈ మేరకు గురువారం చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుని, మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌ని, టిడిపి జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునను సిఐటియు నాయకులు టివి రమణ, అంబళ్ల గౌరినాయుడు, ఇప్పిలి గురునాయుడు, కార్మికులు కలిసి వినతి పత్రం అందజేశారు. లేని కంపెనీలను సృష్టించి అన్యాయంగా 25 మంది కార్మికులను పౌల్ట్రీ నుండి తొలగించారని వారికి వివరించారు. మహిళలు అని కూడా చూడకుండా అన్యాయంగా తొలగించిన మహిళా కార్మికులను కర్లాం నుండి చత్తీస్‌ఘడ్ వెల్లి అక్కడ ఉద్యోగాలలో చేరాలని పౌల్ట్రీ యాజమాన్యం హుకుం జారీ చేసిందన్నారు. ఈ ప్రాంతంలో పౌల్ట్రీ ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజలను కాకుండా వేరే రాష్ట్రం నుండి కార్మికులను తీసుకు వచ్చి పౌల్ట్రీలో పని చేయించుకుంటున్నారని సిఐటియు నాయకులు వారికి వివరించారు. సమస్యను పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు 8 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 4 తేదీ నుంచి 6 తేదీ వరకు రాజమండ్రి లో జరగనున్న రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు నెల్లిమర్ల మండలం కొండవెలగాడ జెడ్‌పి హైస్కూలుకు చెందిన 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వి.జ్ఞానశంకర్, పాఠశాల పీడీ పతివాడ శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర పోటీల్లో విజేతలుగా నిలిచి జిల్లా,పాఠశాల ప్రతిష్ఠను ఇనుమడింప చేయాలని కోరారు.

అసెంబ్లీని దేవాలయంగా చూస్తున్నా

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-రామభద్రపురం

అసెంబ్లీ అంటే తనకు దేవాలయంతో సమానమని ఎపి శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తెలిపారు. గురువారం బూశాయవలస లో జరిగిన సాలూరు మాజీ సమితి ప్రెసిడెంట్ గంటా తిరుపతిరావు కుమారుని వివాహవేడుకకు విచ్చేశారు. ఆయనకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, మాజీ ఎమ్మెల్యేతెంటు లక్ష్మునాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు విలేకర్లతో మాట్లాడారు. పదవులు తనకు కొత్తకాదని ప్రజలకు సేవ చేయడమే తన ప్రధాన కర్తవ్యమని తెలిపారు. విశాఖను ఆర్థిక రాజధానిగా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, విశాఖకు ఇప్పుడు అన్ని పరిశ్రమలు రాబోతున్నాయని స్పష్టం చేసారు. ఎమ్మెల్యే లందరికీ తగు శిక్షణ ఇప్పించి అందరూ అసెంబ్లీలో వారి నియోజకవర్గం సమస్యలు తెలియజేయలన్నదే తమ పార్టీ ధ్యేయమన్నారు. గత వెసిపి పాలన అరాచకమని, ఇప్పుడు గెలిచిన 11మంది కూడా ప్రజా సమస్యలను పక్కన పెట్టి సొంత అజెండాతో ముందుకు వెళ్లడం పద్ధతి కాదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కూడా చట్ట పరిధిలో లేని ప్రతిపక్ష హోదా కోసం చిన్న పిల్లాడి మాదిరిగా హోదా ఇస్తేనే అసెంబ్లీ కి వస్తాను అని మంకు పట్టుబట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ లక్ష్మునాయుడు, ఎమ్మెల్సీ శ్రీనివాసుల నాయుడు, ఎంపిటిసి మడక తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, చిత్రంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన

జెఎన్‌టియులో స్పోర్ట్స్ డే

విజయనగరం టౌన్ : జెఎన్‌టియులో గురువారం స్పోర్ట్స్‌డే వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 5:30 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు స్పోర్ట్స్ డే, వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. యూనివర్శిటీ విసి డి. రాజ్యలక్ష్మి ప్రధాన అతిథిగా, రిజిస్ట్రార్ జి. జయసుమ గౌరవ అతిథులుగా విచ్చేశారు. క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఉత్తర తీర ప్రాంతానికి చెందిన ప్రముఖ పారాఅథ్లెట్ కె.లలిత, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ వి.శ్రీనివాసరావును సత్కరించారు. కార్యక్రమాన్ని పారా అథ్లెట్ లలిత జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా 2022-23 విద్యాసంవత్సరం నుండి ఇప్పటివరకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మెడల్స్, సర్టిఫికేట్లతో సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇన్‌ఛార్జి, నిర్వహణాధికారి ఆర్. రాజేశ్వరరావు పాల్గొన్నారు.



పారా అథ్లెట్ లలితను సత్కరిస్తున్న విసి తదితరులు



ధర్నా చేస్తున్న బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్లు

పెన్షన్ సవరణను నిలిపివేయాలి

బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్ర ప్రభుత్వం పెన్షన్ రివిజన్ లేకుండా తీసుకొచ్చిన ఆర్థిక బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆలిఇండియా బి ఎస్ ఎన్ ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి ఎస్ ప్రకాశరావు, జి.భాస్కరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గతనెల 25న లోక్ సభలో ఆర్థిక బిల్లు ను ఆమోదించిందని తెలిపారు. ఆ బిల్లులో పెన్షనర్లకు ఇక మీదట పే రివిజన్స్ జరిగినప్పుడు పెన్షన్ రివిజన్ జరగదని, కొత్తగా రిటైర్మెంట్ అయిన వారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. అంటే 60ఏళ్లకు ఉద్యోగ విరమణ చేసినప్పుడు ఎంత పెన్షన్ ఇస్తారో రిటైర్డు అయినప్పుడు కూడా అంతే పెన్షన్ వస్తుందని అన్నారు. ఈ సవరణ పెన్షనర్స్/ఫ్యామిలీ పెన్షనర్లకు అన్యాయం చేస్తున్నందున వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో డి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల సంఘం నాయకులు అలుగు వెంకటరావు మద్దతు తెలిపారు.

లైవ్‌స్టాక్‌తో జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

విజయనగరంకోట : మాంసం, గుడ్లు. పాడి ఉత్పత్తి ద్వారా జిల్లాలో అభివృద్ధి సూచీలను పెంచడానికి తగు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో పశు సంవర్ధక శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య ద్వారా ప్రతి మండలంలో ఒక గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి కి సూచించారు. అందుకు కావలసిన సాంకేతికపరమైన సహకారాన్ని పశు సంవర్ధక శాఖ అధికారులు అందించాలని తెలిపారు. రానున్న 10 రోజుల్లో ప్రణాళికలు వేసి ఇవ్వాలన్నారు. నియోజకవర్గానికి ఒక మహిళా ఎంట్రప్రెన్యూర్‌ను గుర్తించి గొర్రెలు, మేకల యూనిట్లను ఏర్పాటుకు కూడా సబ్సిడీ పై రుణాలు అందజేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం వెయ్యి ఎకరాల్లో పశు గ్రాసం వేశారని, మరో వెయ్యి ఎకరాలకు విస్తరించాలని సూచించారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వైవి రమణ, సిపిఒ బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఆ శాఖ డిడి లు, ఎడిలు, మండల పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

టెన్త్ మూల్యాంకనం ప్రారంభం

పరిశీలించిన కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పేపర్లు మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. స్థానిక సెయింట్ జోసెఫ్ స్కూల్లో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా రెండు గంటల ఆలస్యంగా 12 గంటలకు ప్రారంభమైంది. 29 తరగతి గదుల్లో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. మొత్తం 813 అసిస్టెంట్ ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, 228 మంది స్పెషల్ అసిటెంట్లు పరీక్ష పేపర్ల దిద్దుబాటు ప్రక్రియలో నిమగ్నమయ్యారు. వీరు సుమారు 1,73,819 రెగ్యులర్ విద్యార్థుల పేపర్లు, 12,454 ప్రైవేటు విద్యార్థుల పేపర్లు దిద్దాల్సివుంటుంది.కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పాట్ కేంద్రాన్ని పరిశీలించి మూల్యాంకనం జరుగుతున్న పరిశీలించి విద్యాశాఖ అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. స్పాట్ వాల్యుయేషన్ లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు ఇబ్బంది పడకుండా వారికి తగిన సదుపాయాలను కల్పించాలని, తరగతి గదులను పెంచాలని కలెక్టర్ ఆదేశించారు.తొలిరోజు రెగ్యులర్ విద్యార్థులు పరీక్ష పేపర్లు తెలుగు 1417, హిందీ 2179, ఇంగ్లీష్ 1571, లెక్కలు 1934, ఫిజికల్ సైన్స్ 1970, ఎన్ ఎస్ 1458, సోషల్ 1238 పేపర్లు మూల్యాంకనం చేసినట్లు డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు. ఓపెన్ స్కూల్ పేపర్లు అన్ని ఆబ్జెక్టులూ కలిపి 610 పేపర్లు మూల్యాంకనం చేసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఎగ్జామ్స్ ఎసి టి.సన్యాసిరాజు, తహశీల్దార్ కూర్మనాథరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్



శిక్షణ పొందిన మహిళలతో ఎడి రామకృష్ణ

అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలి

జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ

ప్రజాశక్తి- డెంకాడ

మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. గురువారం పెదతాడివాడ గ్రామంలో ట్రెడ్జ్ ఐటి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాంప్ పథకం ద్వారా వ్యవస్థాపకత నైపుణ్యాభివృద్ధిపై కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలకు ఆయన పలు సూచనలు చేశారు. మహిళలు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందితే కుటుంబం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నెల 12 వరకు శిక్షణ కార్యక్రమంలో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ చప్ప రూప, జిల్లా పరిశ్రమ సంస్థ ఐపిఒ రమణ మూర్తి, రిసోర్స్ పర్సన్ శీలం అనూష, పాల్గొన్నారు.

బిసి రుణాలకు 454 దరఖాస్తులు

ప్రజాశక్తి- రాజాం

రాజాం పురపాలక సంఘం పరిధిలోని సత్యనారాయణపురం సచివాలయంలో బిసి రుణాలు కోసం 454 మంది దరఖాస్తు చేసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తుదారులకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయడానికి అర్హులైన జాబితాను బ్యాంకులకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, బ్యాంకు మేనేజర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి పరీక్షలు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 4వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కు అవసరమైన శిక్షణను ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆపస్ రాష్ట్ర కార్యదర్శి ఇజ్జిరోతు రామునాయుడు, జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలు తెలిపారు. కోట వద్ద గల జీయర్ కాంప్లెక్స్ రెండవ అంతస్తు ఆపస్ కార్యాలయంలో ప్రతిరోజు సాయంత్రం 4:30 గంటల నుండి సాయంత్రం ఏడున్నర గంటల వరకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాటిపాడులో ప్రత్యేక సేవా శిబిరాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని తాటిపాడు గ్రామంలో జిఎమ్ఆర్ఐటి రాజాం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉచిత జనరల్ వైద్య శిబిరం, ఆరోగ్యం-పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గ్రామంలో ఆరోగ్యం-పరిశుభ్రత అంశంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బాబురావు, ఎమ్‌పియూపి స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు గార రాంబాబు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించ వచ్చునని అన్నారు.

వ్యసనాల జోలికి పోవద్దు : సిఐ

ప్రజాశక్తి-కొత్తవలస

విద్యార్థులు వ్యసనాల జోలికి పోవద్దని సిఐ షణ్ముఖరావు కోరారు. మంగళపాలెం వద్ద ఉన్న సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా, బెట్టింగ్ యాప్స్‌కు ఆకర్షితులు కాకుండా చదువుపై శ్రద్ధ చూపాలని కోరారు. ప్రతిఒక్కరూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కేథరిన్, ప్రిన్సిపల్ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండవెలగాడ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడనుందని డిఇఇ పి.త్రినాధరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండవెలగాడ సబ్ స్టేషన్ పరిధిలో కొండ వెలగాడ ఎస్ఎస్‌హెచ్ క్యూ ఫీడర్, పారసాం 11 కెవి రూరల్ ఫీడర్, తాళ్ల పూడిపేట 11కెవి రూరల్ ఫీడర్ లైన్ కింద వ్యసాయం కనెక్షన్ పనులు, చెట్టుకొమ్మలు తొలగించడం, సాంకేతిక సమస్యలను సరి చేయడం జరుగుతుందన్నారు. దీంతో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొండవెలగాడ, చంద్రంపేట, తాళ్ల పూడి పేట, టెక్కలి, ఎల్ఎన్‌పురం, తుమ్మలపేట, పెదబూరాడ పేట గ్రామాలకు విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదార్లు సహకరించాలని ఆయన తెలిపారు.

ఎస్.కోట పట్టణంలోనూ కోత

శృంగవరపుకోట : పట్టణంలోని శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎఇ రవి తెలిపారు. పట్టణంలోని 11 కెవి విద్యుత్తు సబ్‌స్టేషన్ పరిధిలో వైర్లను తాకుతున్న చెట్లను తొలగించనున్నట్లు చెప్పారు. పట్టణంలోని ఎస్‌సి కాలనీ, గౌరీశంకర్ కాలనీ, జిసిసి రోడ్డు, మనసబువీధి, మొండివీధి, నూకాలమ్మ టెంపుల్, కొత్తవీధి, వన్‌వే ట్రాఫిక్, అలంకార్, సీతమ్మపేట, ప్రకాశం మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

సంత యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జామి

మండలంలో లొట్లపల్లి పశువుల సంతకు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, ఆ సంత యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఇఒపిఆర్‌డి పీరుబండి ఉమకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆది, సోమ, మంగళ వారాల్లో పశువుల సంత అక్రమంగా నిర్వహిస్తూ లక్షలాది రూపాయలును దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర సభ్యులు కెవిఆర్ సత్యనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షులు చోల్ల రాజకుమారి పాల్గొన్నారు.

ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది పంచాయతీ పరిధిలో ఉన్న ఎం.సింగవరంలో గ్రామదేవత వేమాలమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లబండ్ల యజమానులకు గ్రామ పెద్దలు నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు బయటో భజన, మహిళా కోలాటం ఏర్పాటు చేశారు. టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, సర్పంచ్ కర్రి యశోద, ఎంపిటిసి గొంప తులసి, నాయకులు మైచర్ల అప్పన్న దొర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.



ఎడ్ల బండి పోటీని తిలకిస్తున్న గ్రామస్తులు



వెదుళ్లవలస-బాగువలస రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు



రేగిడి : అరసాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కళా వెంకటరావు

ప్రజాశక్తి - చీపురుపల్లి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. చీపురుపల్లి నుండి వెదుళ్లవలస వయా బాగువలస మీదుగా రూ.8.76 కోట్లతో నిర్మాణం చేసిన తారు రోడ్డుని ఆయన స్థానిక నాయకులతో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో గ్రామాలు, పట్టణాలు అభివృద్ధికి నోచుకోలేదని గుంతల రోడ్లుతో ప్రజలు నరకయాతన పడ్డారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.861 కోట్ల రూపాయలతో గుంతల రోడ్లుకు సంబందించి మరమ్మత్తులు చేసామన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత, బిటి, సిసి రోడ్లుకి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు రౌతు కామునాయుడు, సారిపాక సురేష్‌బాబు, తాడ్డి సన్యాసినాయుడు, పైల బలరాం, దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, ముల్లు రమణ, దాసరి ప్రసాద్, జనసేన నాయకులు విసినిగిరి శ్రీనివాసరావు, బిజెపి నాయకులు మన్నెపురి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

రానున్న స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు, టిడిపి నాయకులు సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే కళావెంకటరావు పిలుపునిచ్చారు. గురువారం చీపురుపల్లి వచ్చిన ఆయన గ్రామాలలో కమిటీలు వేయాలని నాయకులకు సూచించారు. రానున్న ఎన్నికలు స్థానిక నాయకులకు సంబంధించినవేనని అందరూ కష్టపడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ప్రతీ కార్యకర్త ఇప్పటి నుండే కష్టపడి స్థానిక ఎన్నికలలో సత్తా చాటాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

వంగర : ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మండలంలోని అరసాడ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆస్మాన్ ఆరోగ్య మందిర్ (పిహెచ్‌సి)ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పాలకుల నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం అప్పుల పాలైపోయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్య, వైద్యం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఒ కె.రాణి మాట్లాడుతూ అరసాడలో ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ చేతుల మీదుగా ఆరోగ్య కేంద్రం ప్రారంభించడం చాలా సంతోషదాయకమన్నారు. ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మండలంలో వివిధ గ్రామాలలో ఇటీవల గజరాజులు వివిధ పంటలు, పశువులకు నష్టపరిచిన దానికి సంబంధించిన నష్టపరిహార చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు లచ్చు బుక్క కృష్ణమూర్తి ధనలక్ష్మి, తహశీల్దార్ ధర్మరాజు, ఎంపిడిఒ త్రినాధరావు, వైద్యాధికారులు ఈశ్వరరావు, సౌమ్య, జ్యోతి, నాయకులు వాసుదేవరావు నాయుడు, మోహన్ రావు, వెంకటరమణ, తుమ్మి రాజగోపాల్, గణపతి, రవి, వంగర, రేగిడి, సంతకవిటి, రాజాంకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఐటిఐ కళాశాల పరిశీలన

రాజాం: పట్టణలో శ్రీకాకుళం రోడ్డు పరిధిలో గల ప్రభుత్వ ఐటిఐ కళాశాలను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పలు సూచనలు చేశారు. రాజాం ప్రభుత్వ ఐటిఐ కళాశాల మన రాష్ట్రంలోనే ముందు వరుసలోకి రావడం గర్వకారణంగా ఉందని చెప్పారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి, జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గర్ల్స్ టాయిలెట్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ భాస్కర్, కమిషనర్ రామప్పలనాయుడు, అధికారులు, కళాశాల సిబ్బంది, కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పాఠశాల పిల్లలు, ఉపాధ్యాయులతో యుటిఎఫ్ నాయకులు విజయగౌరి

పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలి

యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి

ప్రజాశక్తి-బొబ్బిలి

బట్టివలస పాఠశాలకు పక్కా భవనాన్ని నిర్మించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. గురువారం మండలంలోని గిరిజన గ్రామమైన బట్టివలసలో యుటిఎఫ్ బృందం పర్యటించింది. అక్కడ పాఠశాల, విద్యకు సంబంధించిన సమస్యలను ఆ గ్రామస్తులను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ 2019లో పాఠశాల లేని ఆ గ్రామంలో ప్రజలే పూరిపాక వేసుకుని, గ్రామానికి టీచర్ కావాలని అడిగారని గుర్తుచేశారు. ఈ విషయమై ఐటిడిఎ పిఒను కలిస్తే, డెప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించారని తెలిపారు. పాఠశాల భవనం నిర్మించాలని కోరితే ఆరేళ్లు గడిచినా ఏర్పాటు చేయలేదన్నారు. ఇదే విషయంపై ఎంఇఒకు వినతి అందించారు.

ఎమ్మెల్యేకు వినతి.. బొబ్బిలికి కూతవేటు దూరంలో ఉన్న బట్టివలసలో శాశ్వత పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేసి, గిరిజన విద్యాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బేబినాయనను కోరారు. ఈమేరకు యుటిఎఫ్ నాయకులు ఆయన్ను కలిసి వినతి అందించారు. యుటిఎఫ్ నాయకుల వినతిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే తాత్కాలిక భవనం ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. ఆర్నెల్లలో శాశ్వత భవనం నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్న కుమార్, మండల అధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు కృష్ణదాసు, సుధాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్‌చక్రవర్తి

పారా లీగల్ వాలంటీర్లకు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ప్యారా లీగల్ వాలంటీర్స్ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకు, ప్రజలకు మధ్య వారధిగా ఉండేవారే ఈ పారా లీగల్ వాలంటీర్స్ అని తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ తరపున ప్రజలకు న్యాయ సేవలను అందించే వారే ప్యారా లీగల్ వాలంటీర్స్ అని తెలిపారు. చిన్న చిన్న సమస్యలను ప్రజల మధ్యకు వెళ్లి పరిష్కరించడానికి పారా లీగల్ వాలంటీర్స్‌కు ఐదు రోజులు శిక్షణ ఇచ్చి వారికి గుర్తింపు కార్డులను జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అందజేస్తుందని చెప్పారు. మొదటిరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా రిసోర్స్ పర్సన్స్ ప్రముఖ న్యాయవాది ఐ.సురేష్ భారత రాజ్యాంగం, ఆస్తి , భూమి తగదాల చట్టం గురించి వివరించారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ దుర్గయ్య పర్మినెంట్ లోక్ అదాలత్ చట్టం, విధుల గురించి తెలిపారు.

అందరికీ లబ్ధి చేకూరేలా సర్వే

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

గ్రామాల్లో రుణ ప్రణాళిక తయారీలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరేలా ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహించాలని వెలుగు ఎపిడి కె.సావిత్రి అన్నారు. గురువారం స్థానిక మండల సమాఖ్య భవనంలో ఎన్యుమరేటర్ల రెండో రోజు నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం పేదరిక నిర్మూలన దిశగా, సామాజిక, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా రుణ ప్రణాళికలు తయారు చేయాలని ఉద్దేశంతో, ఏ విధమైన అప్పుల జోలికి పోకుండా ఉండేందుకు ఈ ప్రణాళికను తీసుకు వచ్చిందని తెలిపారు. ఎంపిడిఒ రవికుమార్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలు సక్రమంగా వినియోగించుకునేలా ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులకు రుణ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం పి.భాగ్యలక్ష్మి, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ అప్పారావు, సిసిలు కోటేశ్వరరావు, కేశవ , నిర్మల, కృష్ణారావు, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మహిళా సంఘాల సభ్యులకు రుణాలు, జీవనోపాధికి సంబంధించిన ప్రణాళిక తయారీపై విఒఎలకు, ఎన్యుమరేటర్లకు ఇస్తున్న శిక్షణ రెండో రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా డిపిఎం ఎల్‌హెచ్ జయశ్రీ మాట్లాడుతూ ఇప్పటి వరకు మహిళలు తీసుకున్న రుణాలు, వారి అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే కాలంలో వారు చేస్తున్న జీవనోపాధి కార్యక్రమం ఎలా ఉంటుందో, వారికి ఎటువంటి ఆర్థిక సహకారం కావాలో గుర్తించాలన్నారు. ఈ విషయాలపై ఎనిమిది స్వయం సహాయక సంఘాలకు గాను ఒక ఎన్యుమరేటర్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రమణ, సిసిలు కోటరావు, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఎపిడి కె.సావిత్రి

దత్తిరాజేరు : స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికల తయారీపై విఒఎలకు, ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డిపిఎం బివివిఎస్ మూర్తి, ఎస్‌విఇపి ఎపిఎం ఎన్‌వివి ఇందిరాదేవి మాట్లాడుతూ ఇంతవరకు మహిళలు తీసుకొన్న రుణాలు, వారి అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే కాలంలో వారికి ఎటువంటి ఆర్థిక సహాయం కావాలన్న విషయాలపై చేపట్టే సర్వే గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిఎం టి.అప్పలనాయుడు, సిసిలు పాల్గొన్నారు.

కొత్త రుణాలకు మొబైల్ యాప్‌లో నమోదు

ప్రజాశక్తి- రేగిడి

గ్రామస్థాయి మహిళా సభ్యులకు కొత్త రుణాల ప్రణాళికలకు మొబైల్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని రాజాం వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వార్షిక రుణం, జీవనోపాధుల ప్రణాళిక తయారీపై విఒఎలు, ఎన్యూమరేటర్‌లకు రెండోరోజు శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులకు అవసరమైన సమయంలో వారి జీవనోపాధులు ఏర్పాటుకు, కుటుంబ అవసరాలకు కావలసిన వార్షిక రుణ జీవనోపాధుల ప్రణాళిక ఎన్యూమరేటర్‌లు తయారు చేయాలని సూచించారు. సంఘ సభ్యులకు అవసరమైన సమాచారాన్ని మొబైల్ యాప్‌లో పొందు పరచాలని, సభ్యులకు అవసరం మేరకు మాత్రమే ఈ సంవత్సరం రుణాలు అందించాలని తెలిపారు. మండలంలో 1815 మహిళా స్వయం సహాయక సంఘాలలో ప్రతీ 8 సంఘాలకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున మండలం 221 మంది ఎన్యూమరేటర్‌లను గుర్తించామన్నారు. సమాచార సేకరణలో వ్యక్తిగత పొదుపు, ఎన్ని రకాల అప్పులు, ఎన్నిసార్లు అప్పు తీసుకున్నది, అప్పు నిల్వ ఎంత ఉన్నది, తీసుకున్న అప్పు ఎటువంటి కార్యక్రమాలు మీద పెట్టుబడి పెట్టినది, ఆదాయం వివరాలు, ఈ సంవత్సరంలో ఎటువంటి అవసరాలకు ఎంత అప్పు అవసరం ఉన్నది అనే వివరాలు సేకరించి మొబైల్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఆశిస్తున్న మాదిరిగా ఒక కుటుంబంలో ఒక మహిళను పారిశ్రామిక వేత్తగా తయారు చేసి, సంవత్సరానికి ప్రతీ కుటుంబం ఒక లక్ష రూపాయలు ప్రభుత్వం ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం బాసిన గోవిందరావు, విఒఎలు పాల్గొన్నారు.

రుణ జీవనోపాధుల ప్రణాళికలు సిద్ధం

సంతకవిటి: స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో విఒఎలు, ఎన్యూమరేటర్లకు రెండవ రోజు శిక్షణ తరగతులు గురువారం కొనసాగాయి. సంఘ సభ్యులు తీసుకున్న వార్షిక రుణాలు, 2025-26 రుణ జీవనోపాదుల ప్రణాళికలు తయారు చేశారు. విఒఎలు 45 మంది, ఎన్యూమరేటర్లు 193 మందితో గ్రామ సంఘాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ హేమలత, ఎపిఎం దదికుమార్, సీసీలు, విఒలు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

లైన్‌మేన్ మృతి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యుత్ లైన్‌మెన్ అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటన నెల్లిమర్ల నగర పంచాయతీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తెలుకలవీధిలో నివశిస్తున్న ఎన్ వెంకటస్వరూప్ (32) విజయనగరం డివిజన్ పూల్‌బాగ్ సెక్షన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం విధులు నిర్వహించిన ఆయన మధ్యాహ్నం వేళ ఇంటికి వచ్చారు. ఎండగా ఉండటంతో నిద్రపోయారు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో నిద్రలేపడానికి ఆయన తల్లి ప్రయత్నించారు. అయితే ఎంతకూ లేవకపోవడంతో ఆందోళనతో కేకలు వేసి, కుటుంబ సభ్యులను పిలిచారు. వారంతా వచ్చి చూడగా అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించుకున్నారు. నాలుగేళ్ళ క్రితం ఉద్యోగంలో చేరిన స్వరూప్‌కు ఇప్పుడిప్పుడే పెళ్లి సంబంధాలు చూస్తున్నామని, ఇంతలోనే చనిపోయాడని కుటుంబ సభ్యులు రోదించారు.

రెండు పశువుల శాలలు దగ్ధం

ప్రజాశక్తి- వంగర

మండలంలోని ఇరువాడలో గురువారం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో రెండు పశువుల శాలలు దగ్ధమయ్యాయి గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు విద్యుత్ వైర్లు కలిసి పోవడంతో నిప్పులు వచ్చి గ్రామానికి చెందిన పెద్దింటి వెంకట నాయుడు, సింగిరెడ్డి పకీరుకు చెందిన రెండు పశువులు శాలలు దగ్ధమయ్యాయి. స్థానికులు మంటలను అదుపు చేయడంతో ఎటువంటి ప్రాణ ఆస్తి నష్టం జరగలేదు.

10 నుంచి ఉచిత కుట్టుశిక్షణ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన పురుష, మహిళా అభ్యర్థులకు ఈనెల 10 నుంచి నగరంలో ఉచిత కుట్టుశిక్షణ అందిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంతకుమార్ తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్)ల ఆధ్వర్యంలో వి.టి.అగ్రహారం బి.సి.కాలనీలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. రెండు నెలలపాటు ఈ శిక్షణ వుంటుందని, ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన 18 నుంచి 45సంవత్సరాల మధ్య వయసు గల మహిళలు, పురుషులు శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ కూడా అందజేస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వి.టి.అగ్రహారంలోని శిక్షణ కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చున్నారు. మరిన్ని వివరాల కోసం 9948127818 (రాంబాబు), 9912578754 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సమస్యల పరిష్కారానికే పర్యటనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టేందుకు డివిజన్ పర్యటనలు చేస్తున్నామని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. గురువారం స్థానిక 27 వ డివిజన్ జొన్న గడ్డి ప్రాంతంలో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత, సచివాలయ సిబ్బంది, తదితరులతో కలిసి డివిజన్ వ్యాప్తంగా పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాలలో కాలువలు సరిగా లేవని ప్రజలు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. విద్యుత్ దీపాలు అక్కడక్కడ పనిచేయడం లేదని చెప్పారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను చేపడుతున్నామన్నారు. ప్రతి డివిజన్ కు 20 లక్షల రూపాయలు చొప్పున సాధారణ నిధులు కేటాయించడం జరిగిందని వాటితో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. స్థానిక కార్పొరేటర్ దుప్పాడ సునీత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ బి.దేవి

బాలికల భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-వేపాడ

బాలికల భద్రతపై ఎస్ఐ బి.దేవి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలను ఎస్ఐ, శక్తి బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ఎస్ఐ సమావేశమై, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. శక్తి బృందాల ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేశారు. తొలుత వల్లంపూడి పోలీసుస్టేషన్‌లో శక్తి బృందం.. ఎస్ఐతో సమావేశమైంది. సచివాలయ మహిళా పోలీసులతో సమావేశమై, పలు సూచనలు చేశారు.



ఎస్‌పి నుంచి ప్రశంసా పత్రంఅందుకుంటున్న ఎస్ఐ

డెంకాడ ఎస్ఐకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి- డెంకాడ

స్థానిక ఎస్ఐ ఎ.సన్యాసినాయుడును జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ క్రైమ్ మీటింగ్‌లో ప్రశంసా పత్రాన్ని అందించారు. ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసినందుకుగాను ఆయనను అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ జిల్లా ఎస్‌పి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడంతో బాధ్యత మరింతగా పెరిగిందని, గ్రామాల్లో ఎటువంటి క్రైమ్ లేకుండా చూసుకుంటానని అన్నారు.

తాగునీటి బోర్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని తిమిడి గ్రామంలో తాగునీటి బోర్లకు సర్పంచ్ వబ్బిన త్రినాథమ్మ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.6 లక్షలు, మండల పరిషత్తు నిధులు రూ.2 లక్షలతో కలిపి గ్రామంలో ఎనిమిది తాగునీటి బోర్లను ఏర్పాటు చేసేందుకు గ్రామ పంచాయతీ తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపిపి సుధారాణి, సంతోషి కుమారి, ఎంపిటిసిలు పదాల ధర్మారావు, జనసేన నాయకులు వి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.